క్లుప్తంగా

సీఎం జగన్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్సీ



నందిగామటౌన్: విదేశీ పర్యటనను ముగించుకుని రాష్ట్రానికి చేరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ స్వాగతం పలికారు. లండన్ పర్యటనను ముగించుకుని కుటుంబసమేతంగా గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రిని శనివారం తెల్లవారుజామున ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ కలిసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కానున్నారని తెలిపారు.

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ



నందిగామ: కౌంటింగ్ ప్రక్రియ అత్యంత సమర్థవంతంగా నిర్వహించేలా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు నందిగామ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ రవీంద్రరావు తెలిపారు. నోవా ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం జరుగనున్న ఓట్ల లెక్కింపులో పాల్గొననున్న కౌంటింగ్ సిబ్బందికి శనివారం స్థానిక పట్టణంలోని కెవిఆర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఆర్వో రవీంద్రరావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటూ పాదయాత్ర



నందిగామ: సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ నందిగామకు చెందిన వైఎస్సార్ సీపీ వీరాభిమాని వినుకొండ రామారావు శనివారం నందిగామ నుంచి విజయవాడ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం ఇంద్రకీలాద్రి ఉన్న దుర్గమ్మను దర్శించుకుని పూజలు చేశారు. నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని) మరోసారి విజయం సాధించాలని కోరుకుంటూ స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కాలినడకన విజయవాడకు పయనమయ్యాడు. సీఎం జగన్‌కు ఘనమైన విజయాన్ని చేకూర్చాలని దుర్గమ్మ సన్నిధిలో మొక్కుకున్నట్లు వినుకొండ రామారావు తెలిపారు. రామారావు 2019లోనూ జగన్ సీఎం కావాలని కోరుతూ నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో 24గంటలపాటు ఒంటికాలిపై నిలబడి స్వామివారికి మొక్కులు చెల్లించాడు.

ప్రతిభచూపిన జగ్గయ్యపేట క్రీడాకారులు




జగ్గయ్యపేట అర్బన్: పల్నాడుజిల్లా నరసరావుపేట గ్రౌండ్‌లో గతనెల 31న జరిగిన అండర్-19 వన్‌డే సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టుకు చెందిన జగ్గయ్యపేట క్రీడాకారులు విశేషప్రతిభను కనబరిచారు. ఈ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు, ప్రకాశం జిల్లాల జట్టులు తలపడగా, కృష్ణా జట్టు 206 పరుగుల తేడాతో గెలుపొందింది. కృష్ణాజిల్లా జట్టు కెప్టెన్ వరుణ్ సాత్విక్ 65 బంతులు ఆడి 108 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఇందులో బౌండరీలు 9, సిక్స్‌లు 8 ఉన్నాయి. బౌలింగ్‌లో రెండు వికెట్లు తీసుకున్నాడని అకాడమీ కోచ్ రాజేంద్ర శనివారం తెలిపారు. అలాగే హాఫ్ స్పిన్నర్ రాజేష్ 2 వికెట్లు తీసుకున్నట్లు ఆయన వివరించారు. టి.వరుణ్ సాత్విక్, ఎస్.రాజేష్‌లు అండర్-19 క్రికెట్ జట్టుకు కెప్టెన్, వైస్ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మైలవరం: బడి ఈడు పిల్లలను తప్పని సరిగా పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ అన్నారు. మైలవరం 6వ వార్డులో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఏరియాలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు.

కాయ్ రాజా కాయ్

- జోరుగా రాజకీయ పందేలు..
- ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్
- గెలుపుపై ధీమాలో ఎవరికి వారు
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- తగ్గేదేలేదంటున్న పందెంరాయుళ్లు



పెనుగంచిప్రోలు/కంచికచర్ల: ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు... సాధించే మెజార్టీ..రాష్ట్రంలో ఆయా పార్టీల జయాపజయాలు...సాధించే సీట్లు...కావేవి పందెం వేయడానికి అనర్హం అన్నట్లుగా పందెంరాయుళ్లు జోరుగా పందేలు కాస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మరో రెండురోజుల్లో జరుగనున్న నేపథ్యంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో రాజకీయపందేలు ఊపందుకున్నాయి. ఎగ్జిట్ పోల్స్ కూడా ప్రకటించడంతో ఆయా పార్టీల నాయకులు, అభిమానులు తమ అభ్యర్థి, పార్టీ గెలుస్తుందంటూ కోట్లాది రూపాయలను పందెం కాస్తున్నారు. పోలింగ్ సరళి, పోలింగ్‌శాతం, ఆయా పార్టీల అభ్యర్థుల బలాలు, ఆయా పార్టీలపై ఉన్న అభిమానం, జయాపజయాలపై ఆయా రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో పందెంరాయుళ్లు బెట్టింగ్‌లు పెడుతున్నారు. రాష్ట్రంలో ఆయా పార్టీల ప్రముఖులు ఎన్నికల బరిలో నిలిచినచోట వారి గెలుపోటములపై కూడా పందేలు కాస్తుండటం గమనార్హం.

రూ.70కోట్లకుపైగా పందేలు..

ఎన్నికల ఫలితాలపై పందేలు కాసేందుకు పలువురు భారీ వడ్డీలకు అప్పులు చేసేందుకు సైతం వెనుకాడటం లేదని తెలిసింది. ఆయా పార్టీల కార్యకర్తలు వేలల్లో పందేలు వేస్తుంటే.. ద్వితీయశ్రేణి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, కొందరు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు సైతం ఈ రాజకీయపందేలకు సై అంటుండటం గమనార్హం. గ్రామాల్లో కొంతమంది ఓ గ్రూపుగా ఏర్పడి పందేలు కాస్తున్నారు. ఇలా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో రూ.70కోట్ల వరకు పందేలు ఖరారైనట్లు రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

మధ్యవర్తి వద్ద అగ్రిమెంట్లు..

పందెం రాయుళ్లు ఎవరికి వారే తమపార్టీ అభ్యర్థియే గెలుస్తారంటూ ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరికొందరు పోలింగ్ సరళి, గత ఫలితాలను విశ్లేషిస్తూ తమ రాజకీయచర్చలతో పందెం రాయుళ్ల కొత్త ఊపునిస్తున్నారు. ఆయా పందేలకు సంబంధించి గ్రామాల్లో పెద్దమనుషులు, పట్టణాల్లో అయితే మధ్యవర్తుల వద్ద పందెం సొమ్ము ఉంచుతున్నట్లు సమాచారం. అదేసమయంలో ఆయా పందేలకు సంబంధించి స్టాంప్ పేపర్లపై అగ్రిమెంట్లు కూడా చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో ఎవరు గెలువనున్నారనే విషయంపై ఎగ్జిట్ ఆయా సర్వేసంస్థలు శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించడంతో పందెంరాయుళ్లు మరింత జోష్ మీదున్నారు. రాజకీయ చర్చల్లో ఆయా సర్వేసంస్థలు చెప్పిన వివరాలను ఊటంకిస్తూ తామంటే..తాము గెలుస్తామంటూ సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్న పలువురు వ్యక్తులు చివరికి పందేలు కాసేవరకు వెళ్తున్నారు.

వైఎస్సార్‌సీపీకే జైకొట్టిన తెలంగాణ పందెగాళ్లు ..

జగ్గయ్యపేట నియోజకవర్గానికి సరిహద్దుగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట, ఖమ్మంజిల్లాలకు చెందిన పందెంరాయుళ్లు కూడా జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికలపై పందేలు కాసేందుకు ఆసక్తిచూపుతున్నారు. మధిర, కోదాడకు చెందిన కొందరు వ్యక్తులు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందంటూ లక్షలాది రూపాయలను పందెం వేశారని సమాచారం. అదే సమయంలో జగ్గయ్యపేటలో టీడీపీకి మద్దతుగా పందేలు కాసుకోండని తప్పకుండా గెలుస్తుందంటూ ఆపార్టీ ప్రముఖ నాయకుడి సోదరులు సూచించగా, అందుకు సూర్యాపేట జిల్లా దొండపాడుకు చెందిన పందెంరాయుళ్లు సున్నితంగా తిరస్కరించారనే వార్తలు జగ్గయ్యపేటలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈఎన్నికల్లో ఎవరు విజయం సాధించనున్నారనేది మరో 48గంటల్లో తేలిపోనుండగా, ఈ బెట్టింగ్ మార్కెట్ ఏస్థాయికి చేరుతుందోననే చర్చ జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు చెందిన ప్రజల్లో జోరుగా సాగుతుంది. ఆయా అభ్యర్థులు, పార్టీల గెలుపోటములపై ఈ నియోజకవర్గాల్లో పందేలు వేసినట్లు ప్రచారంలో ఉన్న కొన్ని వివరాలు ఇలా ఉన్నాయి.

- ఓ ఆలయ చైర్మన్ ఏకంగా రూ.15లక్షలు పందెం వేసినట్లు సమాచారం. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుపొందుతారంటూ రూ.5లక్షలు, వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తుందంటూ రూ.10లక్షలు పందెం వేసినట్లు ప్రచారం సాగుతోంది.
- నందిగామలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గెలుపొందుతారంటూ మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భర్త రూ.5లక్షలు బెట్టింగ్ వేసినట్లు సమాచారం.
- వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకుంటుందంటూ పెనుగంచిప్రోలు మండలం వెంకటాపురంలో ఓ రైతు రూ.15లక్షల విలువగల ఎకరం పొలాన్ని పందెం వేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.
- నందిగామలో టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య గెలుస్తారంటూ ఓ మాజీ బంగారు వ్యాపారి రూ.20లక్షలు పందెం వేసినట్లు సమాచారం.
- రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలుస్తుందంటూ వీరులపాడు మండలానికి చెందిన ఓ ప్రముఖుడు రూ.50లక్షలు, కంచికచర్ల మండలంలో ప్రజాప్రతినిధి రూ.10లక్షలు, కీసర ఓ మాజీ సర్పంచి బావ రూ.8లక్షలు పందెం కాసినట్లు తెలిసింది.
- రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందంటూ జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామంలో నలుగురు టీడీపీ నాయకులు కలిసి రూ.50లక్షలు పందెం వేసినట్లు సమాచారం.

1572 మద్యం సీసాలు స్వాధీనం

తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): తెలంగాణ నుంచి ఏపీకి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి శనివారం తెలిపారు. తెలంగాణలోని మేళ్లచెరువు నుంచి నందిగామ మండలం పెద్దవరం గ్రామానికి కారులో అక్రమంగా మద్యం తీసుకువెళ్తున్నట్లు సమాచారం అందడంతో జయంతిపురం వద్ద వాహనాల తనిఖీ చేపట్టి ఓకారులో అక్రమంగా తరలిస్తున్న 1572 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. కారును సీజ్ చేయడంతోపాటు మద్యం అక్రమ తరలింపునకు సంబంధించి పెద్దవరం, చెరువుకొమ్ముపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

క్రీడాకారులకు హాకీ స్టిక్స్, బాల్స్ పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలోని హాకీ క్రీడాకారులకు సీనియర్ హాకీ ప్లేయర్ బి.హేమంత్‌కుమార్ హాకీ స్టిక్స్, బాల్స్ పంపిణీ చేశారు. వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం స్టేడియం ఆవరణలో శనివారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన ముందుగా సమ్మర్ క్యాంపు ఆడిన పిల్లలందరికి స్టిక్స్, బాల్స్ అందజేశారు. అనంతరం హేమంత్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో కూడా చిన్నారులు రాణించాలని సూచించారు. తమకు ఆసక్తి కలిగిన రంగాలపై చిన్నారులు పట్టు సాధిస్తే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఏ క్రీడలో అయినా ప్రత్యేక శిక్షణ తీసుకొని, నిరంతరం క్రమశిక్షణతో సాధన చేస్తే తప్పకుండా విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఎంబీ స్టేడియం అజిత్‌సింగ్‌నగర్ హాకీ కోచ్ కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



జగ్గయ్యపేట టౌన్‌షిప్‌లో శ్రీపంచముఖ ఆంజనేయుడికి పూజలు చేస్తున్న భక్తులు



కె.కంద్రికలోని దాసాంజనేయ స్వామివారు



రామిరెడ్డిపల్లి చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా హనుమజ్జయంతి వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా హనుమాన్, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నందిగామ పట్టణ శివారు కె.కంద్రిక ప్రాంతంలోని స్వయంభు దాసాంజనేయస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నందిగామలోని గాంధీనగర్, చందమామపేటల్లోని పంచముఖ ఆంజనేయస్వామి, మార్కెట్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయాల్లో ఆకుపూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పల్లగిరి గుట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు చేయడంతోపాటు భక్తులకు అన్నదానం చేశారు. అనాసాగరం, హనుమంతుపాలెం, మండలంలోని అడవిరావులపాడు, చందాపురం, కొండూరు, గోళ్ళమూడి, రామిరెడ్డిపల్లి, రాఘవాపురం గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారి జయంతిని పురస్కరించుకుని పూజలు చేశారు. మండలకేంద్రం చందర్లపాడుతోపాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

బలుసుపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని గురుధాం ఆశ్రమంలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాత్వికుడు గెంటేల వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో కైలాసగిరి మండపంలో ఆంజనేయ స్వామి వారికి తమలపాకు పూజ, అభిషేకాలు, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గెంటెల వెంకటరమణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం హోమ పూర్ణాహుతి, అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : హనుమజ్జయంతి వేడుకలను మండలంలో శనివారం వైభవంగా నిర్వహించారు.

వత్సవాయితోపాటు దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, మక్కపేట, భీమవరం, మంగొల్లు, గోపినేనిపాలెం గ్రామాల్లో ఆలయాల్లో ఆంజనేయస్వామివారికి ప్రత్యేక చేవారు. తమలపాకు పూజతోపాటు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మక్కపేటలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయంలో ఉన్న హనుమాన్ విగ్రహంకు ఆలయ నిర్మాణ ధర్మకర్త మల్లెల గాంధీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భీమవరం, మంగొల్లు, వత్సవాయిల్లోనూ భక్తులకు అన్నదానం చేశారు.



గురుధాం ఆశ్రమంలో పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు



పెనుగంచిప్రోలులో స్వామి వారికి ఆకుపూజ..

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : హనుమజ్జయంతి సందర్భంగా కంచికచర్ల మండలంలోని ఆయా ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిటాల జాతీయ రహదారి పక్కన కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో వేలాది మంది భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఐదువేల మంది భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదే విధంగా కంచికచర్లలో పాతశివాలయంతోపాటు మండలంలోని గండేపల్లి, కీసర, పెండ్యాల, గనిఆత్కూరు, మున్నలూరు, కునికెనపాడు, చెవిటికల్లు, గొట్టుముక్కల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయస్వామికి మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. తమలపాకులతో అర్చన చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అల్లూరు, జుజ్జూరు, పెద్దాపురం తదితర అన్ని గ్రామాల్లోని ఆంజనేయస్వామివారికి పంచామృతాభిషేకాలు, తమలపాకు పూజ, లక్ష మల్లెలార్చన చేశారు.

జగ్గయ్యపేట అర్బన్ : హనుమజ్జయంతి వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆయా ఆంజనేయస్వామి ఆలయాల వద్ద బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలోని శ్రీగురుదత్త రాఘవేంద్ర స్వామి, అభయాంజనేయస్వామి, ఆనందసాయి ఆలయం వద్ద ఉన్న శ్రీదాసాంజనేయస్వామి, సత్యనారాయణపురం శ్రీరాంబంటు తోటలోని శ్రీరాంబంటు ఆంజనేయస్వామి, చెరువుకట్టమీద శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు గండికోట శ్రీరామచంద్రమూర్తి, గండికోట శ్రావణ్ కుమార్, ముడుంబా వరదాచార్యులు ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, మహన్యాసపూర్వక మన్యసూక్త రుద్రాభిషేకం, అరటిపండ్లు, లక్షమల్లెలు, తమలపాకులతో విశేష కదలీఫల, నాగవల్లి దళార్చన తదితర పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణబజారులోని దాసాంజనేయస్వామి, డాంగేనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ కౌన్సిలర్ కొలగాని వెంకయ్య ఆధ్వర్యంలో, అద్దాలబజారులోని పాతవెంకటేశ్వరస్వామి ఆలయం స్థలంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జగ్గయ్యపేట శివారులోని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీభూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పెనుగంచిప్రోలు మండలంలోని ఆయా ఆలయాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆంజనేయ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, తమలపాకు పూజలు, మల్లెల అర్చనలు నిర్వహించారు. పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో స్వామివారికి అర్చకులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. తూర్పు బజారు కోదండ రామాలయం, డౌన్ సెంటర్ వద్ద ఆంజనేయ స్వామివారి ఆలయాల్లో ప్రత్యేకపూజలతోపాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు.



జగ్గయ్యపేటలో స్వామివారికి లక్షమల్లెలతో పూజలు చేస్తున్న అర్చకులు



పరిటాలలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పోలీస్ వాహనాలతో మార్చ్‌ఫాస్ట్



పోలీసులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి సీఐ పరమేశ్వరరావు

జగ్గయ్యపేట: ఈనెల నాలుగో తేదీన ఓట్లలెక్కింపు జరుగనున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగ్గయ్యపేట పోలీసులు శనివారం తమ పోలీసువాహనాలతో పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఇన్‌చార్జి సీఐ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలోని ప్రధానవీధులతో పాటు మండలంలోని తిరుమలగిరి, చిల్లకల్లు, గౌరవరం గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ పరమేశ్వరరావు మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైండోవర్ వ్యక్తులు ఘర్షణలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పాటించాల్సిన ఆయా అంశాలపై పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు పద్మారావు, సూర్యభగవాన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో పోలీసు కవాతు

కంచికచర్ల : ఎగ్జిట్ పోల్స్ వస్తున్న సందర్భంగా ప్రజలు సంయమనం పాటించాలని, ఎటువంటి అల్లర్లకు పాల్పడరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం సూచించారు. కంచికచర్లలో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలంటూ మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత బాణా సంచా కాల్చటం, బైక్‌లతో ర్యాలీచేయడం చేయరాదన్నారు. 144సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండరాదని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దుర్గారావు, హెడ్‌కానిస్టేబుల్ వేణు, స్థానిక, కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో హాజరవుతున్నారు. శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులచే చదివించారు. అనంతరం మ్యాథ్స్ విద్యార్థి ఎం.నదియా లెక్కల పుస్తకం లేకుండా మల్టీఫికేషన్స్ తేలికగా చేయడం, పాటలతో లెక్కలు చేయడంపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. పీఈటి మణిరత్నం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, ఉపాధ్యాయులు బాబురావు, వర్షిత, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యవతి, రమేష్ పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల : రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశిబిరాన్ని చిన్నారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని వివరించారు. విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఎం.కనకారావు, వేల్పుల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కంచికచర్లలో చెస్ నేర్చుకుంటున్న విద్యార్థులు



వ్యాయామం క్లాస్‌కు హాజరైన విద్యార్థులు



పేటలో విద్యార్థులకు శిక్షణనిస్తున్న ఉపాధ్యాయులు

అమలులో 144 సెక్షన్: ఎస్ఐ

వత్సవాయి : ఆరోతేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ అభిమన్యు శనివారం తెలిపారు. శాంతి భద్రతల రిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతల విరాళం

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు శనివారం విరాళాలు అందజేశారు. బత్తుల ఆంజనేయులు రూ.లక్షా 116, నాళ్ళా సత్యనారాయణరావు రూ.లక్షా 11 వేలు, కంచి చిన అంజయ్య రూ.15,116, మరింగంటి జగన్నాథాచార్యులు రూ.11,116, తుమ్మేపల్లి నాగవెంకటసాయి మనోహర్, గుండాల శేషగిరిరావు, రాచర్ల లక్ష్మి రూ.10,116 చొప్పున, తంగిరాల వెంకటరెడ్డి రూ.25,116, పరసా శ్రీనివాసరావు రూ.25,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

లైంగిక దాడి కేసులో డీఎస్పీ దర్యాప్తు

ముసునూరు: దళిత మహిళపై లైంగిక దాడి కేసులో ఘటనా స్థలాన్ని నూజివీడు డీఎస్పీ పరిశీలించారు. సూరేపల్లికి చెందిన దళిత మహిళపై గురువారం ఉదయం గ్రామానికి చెందిన కొండపల్లి చెన్నారావు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ మహిళ శుక్రవారం సాయంత్రం ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు శనివారం విచారణ ప్రారంభించారు. డీఎస్పీ గోలి లక్ష్మయ్య సూరేపల్లి నిమ్మతోటలోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు.